క్లుప్తంగా

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని 4, 5 వార్డుల్లో సీసీరోడ్డు పనులను మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శంకర్‌పల్లిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. రాజకీయాలకతీతంగా అందరూ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకట్రామిరెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మమ్మ, గోపాల్ పాల్గొన్నారు.

సీసీ వేశారు.. మొరం మరిచారు



ప్రమాదకరంగా మంచన్‌పహాడ్‌కు వెళ్లే సీసీరోడ్డు

నందిగామ: మండల పరిధిలోని మంచన్‌పహాడ్ గ్రామానికి అద్దంలా మెరిసేలా సీసీరోడ్డు వేశారు.. కానీ రోడ్డుకు ఇరువైపులా మొరం పోయడం మరిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై ఎదురెదురుగా భారీ వాహనాలు వచ్చినట్లయితే ఒక వాహనం ఏ మాత్రం రోడ్డు కిందకు దిగితే చాలు కిందకు పడిపోయే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ద్విచక్ర వాహనదారులు సైతం ప్రమాదాల బారినపడే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళలో కొత్తగా ఆ రోడ్డుపై వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఏ మాత్రం అదుపు తప్పినట్లయితే వారు కింద పడిపోవడం ఖాయం. సంబంధిత అధికారులు స్పందించి సీసీరోడ్డుకు ఇరువైపులా మొరం పోయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాహనదారులు కోరుతున్నారు.

మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: రాష్ట్ర శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

కేశంపేట: బీజేవైఎం మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన పాలాది శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు బాబయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రఘురాంగౌడ్‌లు పాలాది శ్రీనివాస్‌కు ఆయనకు నియామకపత్రం అందించారు. మండలంలో బీజేవైఎం బలోపేతానికి కృషి చేస్తానని శ్రీనివాస్ ఈ సందర్భంగా తెలిపారు.

ముస్తఫాహిల్స్ కాలనీ అధ్యక్షుడిగా అన్వర్‌ఖాన్

మొయినాబాద్: మొయినాబాద్‌లోని ముస్తఫా హిల్స్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిగా అన్వర్‌ఖాన్ ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అన్వర్‌ఖాన్‌తో పాటు ఉపాధ్యక్షుడిగా యాదగిరియాదవ్, కోశాధికారిగా షేక్ నూర్ బాయ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అన్వర్‌ఖాన్ మాట్లాడుతూ.. కాలనీలోని విద్యుత్, డ్రైనేజీ, నీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు.

కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు కబడ్డీ పోటీల్లో పాల్గొని చక్కని ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్కూల్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఇంటర్ స్కూల్ కాంపిటీషన్ కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు చక్కగా రాణించి టోర్నీలో మూడో స్థానాన్ని దక్కించుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందినట్లు తెలిపారు.

నిలువ నీడ కరువు

- బస్‌షెల్టర్లు లేక గంటల తరబడి రోడ్లపైనే ప్రయాణికులు
- ఎండ, వానలోనూ ప్రజలకు తప్పని తిప్పలు
- దుకాణాల వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



అజీజ్‌నగర్ చౌరస్తాలో రోడ్డుపై బస్టాప్‌లో నిలబడిన విద్యార్థులు



అమ్డాపూర్ చౌరస్తాలో బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు, విద్యార్థులు

మొయినాబాద్ రూరల్: ఆర్టీసీ ప్రయాణికులకు నిలువ నీడ కరువవుతోంది. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ రోడ్లపైనే వారు బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. కూర్చుందామన్న కుర్చీ లేదు కనీసం నీడ కూడా లేని పరిస్థితి. హైదరాబాద్–బీజాపూర్ ప్రధాన రహదారిపై ఉన్న పోలీస్ అకాడమీ అప్పా మొదలుకొని టోల్‌కట్ట బస్టాప్ వరకు ఆయా గ్రామాల చౌరస్తాలలో బస్టాప్‌లు ఉన్నా బస్‌షెల్టర్లు లేవు. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, ఆయా విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు గంటల తరబడి రోడ్లపై వేచి ఉంటూ ఇబ్బంది పడుతున్నారు. అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, అమ్డాపూర్ చౌరస్తా, మొయినాబాద్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, తోల్‌కట్ట ఆయా గ్రామాల చౌరస్తాలలోని బస్టాప్‌లలో బస్‌షెల్టర్లు కరువయ్యాయి. దీంతో ప్రయాణికులు రోడ్లపై నిల్చొని బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. మండల పరిధిలో అనేక ఇంజినీరింగ్ కళాశాలలు, పలు మెడికల్, డెంటల్ కళాశాలలతో పాటు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. జంట నగరాల నుంచి చదువుకోవడానికి ఈ ప్రాంతాలకు వచ్చి వెళ్తుంటారు. బస్టాప్‌లలో కనీసం బస్‌షెల్టర్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ద్వారా సంబంధిత అధికారులు, ప్రైవేటు సంస్థలు స్వచ్ఛందంగా పరిశీలించి బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఆదాయం ఉన్నా..

ఆర్టీసీ అధికారులు మారుమూల గ్రామాల్లో ప్రయాణికులు అవస్థలు పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా ఆచరణలో సాధ్యం కావడం లేదు. ఆర్టీసీ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతున్నా సౌకర్యాల కల్పనపై శ్రద్ధ చూపడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బస్ షెల్టర్లు నిర్మించాలి..



మండల కేంద్రంలో ఉన్న ఆయా గ్రామాల చౌరస్తాలలో బస్టాప్‌ల వద్ద బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలి. ఎండాకాలంలో ప్రయాణికులు రోడ్లపై వేచి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియని పరిస్థితి. వేసవిలో ఎండలకు, వర్షంలో రోడ్డుపై నిల్చొని ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌షెల్టర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– గడ్డం వెంకట్‌రెడ్డి, సురంగల్ గ్రామస్తుడు

గంటల తరబడి రోడ్లపైనే..



మండల కేంద్రంలోని బస్టాప్‌లలో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపైనే నిల్చుంటున్నారు. ఎండనకా వాననకా కూర్చుందామన్న కనీసం నీడ కూడా లేని పరిస్థితి. బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు రోడ్లపై గంటల తరబడి నిల్చొని చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం బస్టాప్‌లు ఉన్న వద్ద బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

– కొత్తపల్లి తిరుపతిరెడ్డి, బాకారం గ్రామస్తుడు



పైపులైన్ మరమ్మతుల కోసం తీసిన గుంతలో నిండిన నీరు

ప్రమాదకరంగా గుంత.. ప్రయాణికుల చింత

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సాయిబాబా దేవాలయం సమీపంలో గల రోడ్డు పక్కన పైపులైన్ మరమ్మతుల కోసం నాలుగు రోజుల క్రితం గుంత తీశారు. సిబ్బంది పనులు పూర్తి చేయకుండా అలాగే వదిలేయడంతో గుంత నిండా పైపులైన్ లీకేజీ నీరు నిండి ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి నుంచి చిలుకూరు బాలాజీతో పాటు ఇతర ప్రాంతాలకు అనేక వాహనాలు, ప్రయాణికులు వెళ్తుంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి వివరణ కోరగా.. మరమ్మతులు నిర్వహించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పటికే చేసిన బిల్లులకు డబ్బులు అందడం లేదు. అయినా పైపులైన్ మరమ్మతులు చేసేందుకు కృషి చేస్తున్నాం. కానీ పైపులైన్ లీకేజీకి మరమ్మతులకు సీసీరోడ్డు పగలగొట్టడానికి కంప్రెషర్ మిషన్ కోసం ప్రయత్నిస్తున్నాం. త్వరలోనే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



బాధ్యతలు స్వీకరిస్తున్న విద్యార్థులు

మొయినాబాద్ రూరల్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని బీజేపీ సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. హిమాయత్‌నగర్ చౌరస్తాలోని స్వామి నారాయణ గురుకుల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించిన విద్యార్థి నాయకుల ఎన్నిక ముగింపు కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, మత, వర్ణ, వర్గ విభేదాలు లేకుండా పాఠశాలలో స్వీయ ఎన్నికలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కెప్టెన్, వైస్ కెప్టెన్, హౌస్ కెప్టెన్, హౌస్ మానిటర్స్, క్లాస్ మానిటర్స్‌గా ఎన్నికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ ఇన్‌చార్జి సుఖ్‌వల్లభ్ దాస్ జీ, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కే.ఎస్.రత్నం, విశ్వదర్శన్ స్వామిజీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్‌నగర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని అమ్డాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993–94లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 30 మంది అజీజ్‌నగర్ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యా యులు రవీంద్రనాథ్, వెంకటేశ్‌యాదవ్‌లను పూలమాలలతో సన్మానించారు. వారందరూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని రోజంతా సందడిగా గడిపారు. కార్యక్రమంలో విద్యార్థులు నారాయణపురం మహేందర్‌ముదిరాజ్, కొత్తపల్లి తిరుపతిరెడ్డి, మాడి రాజేందర్‌రెడ్డి, యాతం సురేందర్‌ముదదిరాజ్, జగన్నాథం, శ్రీనివాసచారి, సామా హర్షవర్ధన్‌రెడ్డి, కటుకూరి శేఖర్‌గౌడ్, కటికే నర్సింగ్‌రావు, తిరుపతియాదవ్, జగన్‌మోహన్, సత్యనారాయణగౌడ్, శ్రీలత, విజయ, విజయలక్ష్మి, విచిత్ర, అరుంధతి, ఇందిర, జ్యోతి, సువర్ణ, మంజులత, కిరణ్‌ముదిరాజ్, నర్సింహాగౌడ్, పాండు, మల్లేశ్, శ్రీశైలం, జగన్, యాదగిరిరెడ్డి, ధనపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యుడు హరికిషన్

కొత్తూరు: సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన మంగళవారం కొత్తూరు మున్సిపల్ కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరంలో కమిషనర్ బాలాజీ, ఇతర అధికారులు, సిబ్బందితో సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వరద నీరు ఎక్కువ రోజులు నిల్వ లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా ఇళ్లలో వాడని నీటి తొట్లు, పాత టైర్లు, కొబ్బరి కాయల్లో నీరు నిల్వ ఉంటే విషజ్వరాలు వ్యాప్తి చేసే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు.ముఖ్యంగా ప్రజలు,వ్యాపారులు చెత్తను ఇళ్ల సమీపంలో, రోడ్లపై వేయొద్దన్నారు.పారిశుద్ధ్య నివారణలో ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ప్ర జలు వర్షాకాలంలో నిల్వ ఉన్న ఆహారాన్నికాకుండా వేడి,వేడి ఆహారాన్ని తినాలన్నారు. అనారోగ్యాలకు గురైతే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్సలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఏఎన్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి: వర్షాకాలం నేపథ్యంలో మున్సిపాలిటీ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని శంకర్‌పల్లి వైద్యాధికారి రేవతిరెడ్డి అన్నారు. మంగళవారం శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అధ్యక్షతన ఆశవర్కర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. వర్షాకాలం డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రాథమిక దశలోనే వైద్యులను సంప్రదించాలన్నారు. అదే విధంగా అన్ని వార్డుల్లో తిరిగి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, చెత్తా, చెదారం లేకుండా చూడాలన్నారు. మురికి గుంతల్లో అయిల్ బాల్స్ వేయాలని కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో మేనేజర్ అంజనీకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డు అభివృద్ధి

మాజీ సర్పంచ్‌ను అభినందిస్తున్న గ్రామస్తులు



వాగులో పైపులు వేయించి రోడ్డును బాగు చేయిస్తున్న మాజీ సర్పంచ్ రాంచంద్రయ్యగౌడ్

చేవెళ్ల: ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టే ప్రజాప్రతినిధులు ఇప్పుడు పదవులు లేకపోయినా కూడా సొంత నిధులు ఖర్చుపెట్టి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. రావుపల్లి గ్రామంలో నిన్న ఓ మాజీ సర్పంచ్ కేసారం శ్రీనివాస్ గ్రామానికి ఉన్న లింకురోడ్డుపై ఉన్న వాగుకు పైపులు వేసి సొంత నిధులు రూ.4లక్షలు ఖర్చుచేసి రోడ్డును అభివృద్ధి చేశాడు. ఈ రోజు మరో మాజీ సర్పంచ్ జి.రాంచంద్రయ్యగౌడ్ సొంతగా రూ.2లక్షలు ఖర్చు చేసి మరో లింక్ రోడ్డుపై ఉన్న వాగులో పైపులు వేసి కాంక్రిట్ వేసి రోడ్డును అభివృద్ధి చేయడంతో గ్రామస్తులు అయనను అభినందిస్తున్నారు. మండలంలోని రావుపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ రాంచంద్రయ్యగౌడ్ సొంతంగా దాదాపు 2లక్షల రూపాయలు ఖర్చు చేసి మంగళవారం గ్రామం నుంచి వయా ఎల్కగూడ మీదుగా మొయినాబాద్ మండలానికి చేరుకునేందుకు ఉన్న లింకురోడ్డుపై వాగులో పైపులు వేసి రోడ్డును బాగు చేయించారు. ఈ రోడ్డు గ్రామస్తులు మొయినాబాద్ మండలానికి చేరుకునేందుకు, రైతులు వారి పొలాలకు వెళ్లేందుకు ఉపయోగపడుతుంది. ఈరోడ్డుపై వాగు ఉండటంతో వర్షాలు పడిన సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు కోరటంతో ఆయన ఈరోడ్డుపై ఉన్న వాగులో పైపులు వేయించి చుట్టూ సిమెంట్‌తో కాంక్రిట్ చేసి రోడ్డును బాగు చేయించాడు. రోడ్డుపై ఇరువైపులా ఉన్న చెట్ల పొదలను తొలగించి రోడ్డును బాగు చేయించే పనులు చేపట్టారు. ఇటీవలో ఆయన మరో గ్రామ నాయకుడు కేసారం నరేందర్‌తో కలిసి గ్రామానికి ఉన్న ప్రధాన రోడ్డుపై ఉన్న గుంతలను మట్టి పోసి పూడ్చి వేయించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ లింకురోడ్డును కూడా సొంత నిధులతో అభివృద్ధి చేయటంతో గ్రామస్తులు ఆయనను అభినందిస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిందితులను శిక్షించాలి

మొయినాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాములు శ్రీనివాస్ మృతికి కారణమైన సీఐ, కానిస్టేబుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాదారం వినయ్, ఉపాధ్యక్షుడు బేగరి రాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం నగరంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ కులానికి చెందిన శ్రీరాములు శ్రీనివాస్‌ను సీఐ జితేందర్‌రెడ్డి, మరో ఐదు మంది కానిస్టేబుళ్లు కులం పేరుతో మానసింగా వేధించినట్లు ఎస్సై ఆత్మహత్యకు ముందు వీడియో రికార్డు ద్వారా తెలియజేశారన్నారు. సీఐ, కానిస్టేబుళ్లు అవమానించిన విషయాన్ని పై అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. బాధిత కుటుంబానికి రూ.1 కోటి నష్టపరిహారం ఇవ్వాలని, పిల్లలకు ప్రభుత్వమే ఉచితంగా విద్యనందించే విధంగా ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కోశాధికారి ప్రమోదర్, సహాయ కార్యదర్శి అప్పలరాజు, నాయకులు యాదగిరి, పుణ్యభాను, దినేశ్ ఉన్నారు.

హామీల అమలులో విఫలం

కొందుర్గు: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు అన్నారు. మంగళవారం బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు జిల్లేడ్ చౌదరిగూడ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు అందిస్తామని చెప్పిన రైతు భరోసాను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చాక రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిందని, ఇచ్చిన మాటకు సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉండాలన్నారు. కౌలు రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు భూపాలాచారి, శ్రీనివాస్, కుర్మయ్య, హనుమాన్, లింగం పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు నేడు(బుధవారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఉష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. పట్టణ, పరిసర గ్రామాల ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలను 9959226287 ఫోన్ నంబర్ ద్వారా తెలియజేసి పరిష్కరించుకోవాలని ఆమె కోరారు.

పంటల నమోదు తప్పనిసరి

ఏఈఓ రవికుమార్



చేగూరు శివారులో పంటల వివరాలను సేకరిస్తున్న ఏఈఓ రవికుమార్

నందిగామ: ప్రతి రైతు తాము పండించే పంటల వివరాలను వ్యవసాయ శాఖలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మామిడిపల్లి క్లష్టర్ ఏఈఓ రవికుమార్ సూచించారు. మండల పరిధిలోని చేగూరు శివారులో మంగళవారం రైతుల పంట పొలాల వద్దకు వెళ్లి పంటల వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి రైతు వర్షాకాలంలో సాగుచేసే ప్రతి పంట వివరాలను, సర్వే నెంబర్ల వారీగా నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రైతులు తమ పంటల వివరాలను నమోదు చేసినట్లయితే పంట దిగుబడులను విక్రయించే సమయంలో రైతులకు సులభమవుతుందన్నారు. అంతేకాకుండా పంటలకు సంబంధించిన సమగ్ర వివరాలు వ్యవసాయశాఖ వద్ద ఉంటాయని వివరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం



కొత్తూరు: జెండా ఆవిష్కరిస్తున్న నరేశ్‌చారి, తదితరులు



చేవెళ్లలో మాట్లాడుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శిరీష, తదితరులు

షాద్‌నగర్‌రూరల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) నగర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు కందడి శ్రీరామ్ హాజరై మాట్లాడుతూ.. ఏబీవీపీ జ్ఞానం, శీలం, ఏకత అనే ప్రధాన సిద్ధాంతాలతో పని చేస్తోందన్నారు. ఏబీవీపీ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా విద్యార్థి, విద్యారంగ సమస్యలపై పోరాడుతుందన్నారు. విద్యార్థులందరూ సేవాభావాన్ని, దేశ భక్తిని అలవర్చుకొని దేశం కోసం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సందీప్, నవీన్, అజయ్, మహేందర్, ప్రశాంత్, ప్రకాశ్, మనోజ్, మహేశ్, శివ పాల్గొన్నారు.

కొత్తూరు: విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటాలు చేస్తోందని ఆ సంఘం కొత్తూరు మండల కన్వీనర్ నరేశ్‌చారి అన్నారు. మంగళవారం పలువురు నాయకులతో కలిసి ఆయన పట్టణ ముఖ్య కూడలిలో సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్ చారి, శేఖర్‌గౌడ్, హర్ష, తేజ, కిరణ్, ప్రణయ్, నిఖిల్, సుదర్శన్, నీలకంఠం పాల్గొన్నారు.

చేవెళ్ల: షాబాద్‌లో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బర్ల శ్రీకాంత్ మంగళవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ప్రవీణ్, సంగమేశ్వర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల: జాతీయవాద భావాలతో విద్యార్థుల సమస్యలపైన నిరంతరం పోరాటం చేస్తూ ఈ రోజు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏబీవీపీ అవతరించిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎన్.శిరీష అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి మహిపాల్, రాఘవేందర్, ప్రదీప్, ప్రేమ్, కిషోర్, శివర, హరికృష్ణ, అనిల్, విష్ణు, తదితరులు ఉన్నారు.

వైద్యులు అందుబాటులో లేక పశువులు మృతి

పశువైద్య కేంద్రం ఎదుట పాడిరైతుల ధర్నా



పశువైద్య కేంద్రం ఎదుట ధర్నా చేస్తున్న పాడి రైతులు

కేశంపేట: పశువులకు సరైన సమయంలో వైద్యం అందక మృతి చెందుతున్నాయని ఆరోపిస్తూ పాడి రైతులు మంగళవారం పశువైద్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాడిరైతు లు మాట్లాడుతూ..కొన్ని నెలలుగా ఆస్పత్రిలో వైద్యురాలు అందుబాటులో ఉండకపోవడంతో చాలా పాడి పశువులు మృతి చెందాయన్నారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలితో పాటు సిబ్బంది ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నట్లు వారు ఆరోపించారు. పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యురాలికి ఫోన్‌చేస్తే లిఫ్టు చేయడం లేదని, దీంతో గోపాల మిత్రలను సంప్రదిస్తే వారు డబ్బులు అధికంగా డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఆస్పత్రిలో ప్రభుత్వం నుంచి మందులు వచ్చినా పాడిపశువులు అనారోగ్యానికి గురైనప్పుడు ఇవ్వకుండా బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకొని ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.